ప్రచురణకు స్వీకరించిన పోటీ కథానిక :

# సాక్షి

రచన: ఆకుండి నారాయణమూర్తి

శరీరారోగ్యం ఏమాత్రం బాగున్నా ఆ నాలుగు మైళ్లూ నలుగురితోపాటు నడిచి వెళ్ళిపోడానికి సంకోచించుండేవాడు కాదు కనకరాజు !....

అసలే చలికాలం !....

దానికితోడు చలిజ్వరం !...

నాలుగు మైళ్ళదూరం ఆ చీకటిలో ఆ పరిస్థితిలో నడిచి వెళ్ళడం ఎంతమాత్రం ఆరోగ్యదాయకమైన విషయం కాదనుకున్నాడు కనకరాజు.

-దాని తరువాత యింకే బస్సూలేదు. పట్నం పోయే ఆఖరి బస్సది !....

పొద్దున్న లేవగానే తానెవరిముఖం చూసేడో ఏమిటో ? ......దరిద్రిగొట్టు బస్సు పట్నమింకా నాల్గు మైళ్ల దూరముందనగానే పాడయిపోయింది !— డ్రైవరూ, క్లీనరూ కొంతసేపు తంటాలు పడ్డారు, ఇక అది తమవల్ల బాగుపడదని నిశ్చయించుకున్నాక, కండక్టర్ని బస్సు దగ్గరుండమని చెప్పి, ఆ ఉభయులూ పట్నమెళ్ళేరు 'ఫోర్‌మెన్'ని తీసుకురాడానికి.

వాళ్ళు పట్నమెళ్ళడం - 'ఫోర్‌మెన్'ని తీసుకురావడం - దాన్ని బాగుచెయ్యడం - ఈ పనంతా పూర్తయేసరికి తెల్లారిపోతుందనే భావంతో ఆనాడు బస్సులో వున్న మిగతా ప్రయాణీకులు కాళ్ళకు బుద్ధిచెప్పేరు.

ఎలాగో ఓలాశ్రమపడి తనూ వాళ్ళ వెనకాల నడచి వెళ్ళిపోవాలని మొదటనుకున్నాడు కనకరాజు.

కానీ........

అడుగుతీసి అడుగెయ్యలేని పరిస్థితి!.... ఏం చేస్తాడు మరి ?.... భగవంతుణ్ణి ధ్యానిస్తూ బస్సులో పడుకున్నాడు తలక్రింద సంచీ పెట్టుకొని

కండక్టరు కనకరాజువేపు జాలిగా చూస్తూ - "బాబూ కాస్త శ్రమయితే అయిందని వాళ్లవెనకాల నడిచెళ్ళిపోవలసింది. ఈ బస్సు బాగుపడేసరికి తెల్లారిపోవచ్చు!" అన్నాడు.

కనకరాజు బాధగా మూల్గుతూ - "ఇంత జ్వరంతో - ఈ చలిలో నడిచెళ్ళితే యింకేమైనావుందీ ? - బ్రతకడానికిష్టం లేకనే ఆపని చెయ్యాలి !" అన్నాడు.

"పాపం!.... బాగా చలిబట్టిపోయున్నారు ! - పోనీ.... తమ సంచిలో కనీసం తువ్వాలయినా లేదేమిటి? అది కాకపోతే లుంగీ ! - ఏదో ఓగుడ్డ ! ఏదుంటే అది తీసి చెవులమించి కప్పుకోకూడదూ ?" అన్నాడు కండక్టరు.

కనకరాజుకి అప్పుడు గుర్తొచ్చింది ; నోట్లకట్టలుంచి లుమ్మచుట్టిన తువ్వాలున్నట్లు ! ఫరవాలేదు ! - సంచిచాలు నోట్లకట్టలుంచడాని కనుకున్నాడు. బైటకు తీసేడు. నోట్లకట్టలను సంచిలో పడేసి, సంచిమూతిని సంచీతాళ్ళతో గట్టిగా ముడి వేసేసి - తువ్వాల్ని చెవులమించి చుట్టుకొని - సంచీని ప్రాణప్రదంగా పట్టుకొని నడుం వాల్చేడు.

కండక్టరు తీక్షణమైన దృష్టి కనకరాజు చేతిలోవున్న సంచీమీద నిలచింది !.... కనీసం రెండువేలరూపాయ లుండొచ్చను కున్నాడు. ఎన్నాళ్లు కష్టపడి పనిచేసినా తానంత ఆర్జించగలడా ? - వట్టిమాట !....

కానీ....

ఒకే ఒక పాపం చేస్తే ?.... ఓహ్ ! - బోలెడు డబ్బు !-

అతని హృదయంలో ఘాతప్రీతి మాతములధ్వని తారస్థాయిని చేరింది.

అతనిలో పెల్లుబుకుతూంది రాక్షసత్వం !

దాన్ని అణగ దొక్కడానికి ప్రయత్నిస్తూంది మానవత్వం !

అతను........

అపరిచితమైన వ్యక్తికాదు.

అనేకసార్లు తమ బస్సులో ప్రయాణం చేశాడు.

పేరూ పూరూ తెలిసిన వ్యక్తి !

తనకేనాడూ అపకారం చెయ్యలేదు.

అటువంటి వ్యక్తిని చేతులారా ఎలా హత్య చెయ్యడం ?

ఎలాగేమిటి ?

డబ్బుకోసం ఎలాగోటలా హత్య చెయ్యాలి మరి ! - ప్రతిమనిషికీ జీవితంలో ఎప్పుడో ఒక్కమారే అదృష్టాన్ని తెచ్చిపెట్టే అవకాశమొస్తుంది. వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోడం అవివేకం తను భాగ్యవంతుడయేటందుకు అంతకంటె మంచి అవకాశమింకోటేదీ రాదనుకున్నాడు కండక్టరు.

కారు చీకటి - నిర్మానుష్య ప్రదేశం - హత్యచెయ్యడానికి అనువైన ప్రదేశం!.... శక్తినంతా కూడగట్టుకొని అరచినా ప్రతిధ్వని తప్ప మరే సమాధానమూరాదు. అటువంటి దిక్కుమాలిన స్థలమిది !

కండక్టరులో పిరికితనం క్రమక్రమంగా వదలిపోతుంది. ధైర్యం హెచ్చుతుంది! -

- కానీ పాపభీతి అతన్ని వెనక్కు లాగుతూంది !....

ఆ మహాపాపం తనుచేస్తే రౌరవాది మహానరక యాతనలనూ తానీలోకంలోనే అనుభవించాల్సొస్తుందేమోనని అతని అనుమానం.

దుర్మార్గపు బుద్ధిలోంచి ఉద్భవించిన పేరాశ అతన్ని రెచ్చగొట్టింది.

రాజ్యకాంక్షతో మానవ మారణ హోమానికి కారణభూతులైన రాజాధిరాజు లెందరో సుఖంగా నూరేసి సంవత్స

రాలు బ్రతికి- చచ్చి స్వర్గానికెళ్లారని మన చారిత్రిక గాథలూ, పురాణ గాథలూ చెపుతున్నాయి!.... ప్రపంచంలో పేరొందిన ప్రతినియంతా మహా హంతకుడు కాదని ఎవరైనా అనగలరా? ఘోరమైన ఎన్ని పాపాలు చేసినా వాళ్లు బ్రతికున్నంతకాలం దర్జాగా బ్రతికేరు! అటువంటిది తనవంటి అల్పమానవుడు ధనకాంక్షతో ఒకే ఒక హత్య చేసినంత మాత్రంలో, చెప్పుకోవలసినంత పాపమేదీ చుట్టుకోదనుకున్నాడు. ఇంతకీ పాప మేఁవిటి?- పుణ్య మేఁవిటి?- ఆ మాటల కసలు అర్థంలేదనుకున్నాడు కండక్టరు. ఆ వ్యక్తికి ఆనాడు తన చేతిలో చావు రాసి పెట్టుంటాడు బ్రహ్మదేఁవుడు!- విధి లిఖితాన్ని అనుసరించి అతనిని తను చంపితే దోషమేఁవీ వుండదనుకున్నాడు. ఇంతకీ వేదాంతులు చెప్పినట్లు తానెవడు?- తను కేవలం నిమిత్త మాత్రుడు!- ఆ వ్యక్తిని తన చేతులతో చంపించాలని బ్రహ్మదేఁవుడు శాసించినప్పుడు యిక తప్పుతుందా మరి?

ఇంతకీ....

విధి వ్రాత తన విషయంలో ఎలాగుందో?

తానా డబ్బుకోసం కక్కుర్తిపడి అతన్ని హత్య చేసేశాక, పోలీసువారు దర్యాప్తు చెయ్యకుండా వూరుకుంటారా?- వాళ్ల దర్యాప్తు ఫలితంగా తనుచేసిన నేరం బయటపడితే... అప్పుడు తన బ్రతుకేమవుతుంది? అమ్మ బాబోయ్!.... ఓ హంతకుడిగా ఉరిశిక్ష పొందమని విధాత తన నుదిటిమీద వ్రాయలేదు కదా?- ఏమో?.... ఎందుకొచ్చిన గొడవ?- బుద్ధిగా కాళ్ళు ముడుచుకొని పడుకోడం మంచి పననుకున్నాడు కండక్టరు.

కానీ బుద్ధిలోపించినప్పుడు బుద్ధిగా పడుకోవడం ఎలా సాధ్యమవుతుంది?

అతనిలో పేరాశ పెల్లుబికింది!....

అంత డబ్బుని చూస్తూ చూస్తూ వదులుకోవడం యిష్టంలేకపోయిందతనికి. తన దారిద్ర్యాన్ని తీర్చేటందుకు భగవంతుడు కల్పించిన మహత్తరమైన అవకాశమదనుకున్నాడు. లేనిపోని కళ్ళంకలతో అట్టి అవకాశాన్ని ఎంతమాత్రం జారవిడచుకోకూడదనుకున్నాడు!- తెలివి తేటల్ని ఉపయోగించి హత్య చేస్తే తనకే ప్రమాదమూ వుండదు. తను బోలెడు డిటెక్టివ్ నవల్సు చదివేడు. ఆ చదువు తాలూకా ఫలితాన్ని వృధాగా పోనివ్వకూడదు. పోలీసు వాళ్లకు "క్లూ"లు దొరక్కుండా హత్య చేసేస్తే తనకే ప్రమాదమూ వుండదనుకున్నాడు.

సరే!- అతన్ని హత్యచేసేసి, ఆడబ్బు దోచుకున్నాక ఏం చెయ్యడం?- పోలీసు వాళ్ళూ, వాళ్ళతోపాటు లోకులూ తనను అనుమానించరా అని?

ఎందు కనుమానించరూ?-

అతనానాడు బస్సులో బయలుదేరినట్లూ, అతనివద్ద డబ్బున్నట్లూ సాక్ష్యముంటుంది!- పాడయి పోవడంచే అవాళ అక్కడ బస్సు ఆగిపోయినట్లూ- డ్రైవరూ క్లీనర్లతోపాటు ఆనాడు బస్సులోవున్న పదిమంది ప్రయాణీకులు నడిచివెళ్ళిపోయినట్లూ- తనూ, కనకరాజూ మాత్రం బస్సులో వుండిపోయినట్లు కూడా సాక్ష్యసేకరణ జరుగుతుంది! కనకరాజు హత్య చేయబడినప్పుడు, తనను ప్రథమ ముద్దాయిగా "అరెస్టు" చెయ్యడం జరుగుతుంది! అలా జరగకుండా వుండేటందుకే తను ఏదైనా కథ అల్లాలి!.... ఎలా కథ అల్లడమూ అని?- చాలా సేపు ఆలోచించేడు. ఆఖరికో ఆలోచన తట్టింది!....

అతన్ని చంపేసి - డబ్బుని సురక్షితమైన స్థలంలో నిక్షిప్తంచేసి పట్నానికి పరుగెట్టుకొని వెళ్ళి - పోలీసు వారికి "రిపోర్టు" చెయ్యాలి!.... ఏమనంటే; పాడయిపోడంచే బస్సు దారిలో ఆగిపోయినట్లూ - డ్రైవరూ - క్లీనరూ - ఒక్క కనకరాజు మినహా మిగతా ప్రయాణీకులూ నడచే వెళ్ళిపోయినట్లూ- తనూ, జ్వరపీడితుడైయున్న కనకరాజూ మాత్రం మిగిలినట్లూ - తను దేహబాధ తీర్చుకోడానికి అలా గెడ్డవేపు వెళ్ళినప్పుడు దొంగలొచ్చినట్లూ - తను తిరిగొచ్చి చూసేసరికి కనకరాజు వాళ్ళతో పెనుగులాడుతున్నట్లూ తను బిగ్గరగా అరచేసరికి ఓ యిద్దరు తన మీదికి కత్తులు పట్టుకొని వచ్చినట్లూ — తను భయపడి పరుగెట్టుకుని వచ్చేసినట్లూ .... కథ అల్లేసి పోలీసు వారికి రిపోర్టు చేసేస్తే వారు తనను అనుమానించరు. లోగడ ఎప్పుడూ ఏ పాడు పనీ తను చెయ్యలేదు గనుక, తానే ఆ పాడు పని చేసేడని ఎవ్వరూ వూహించలేరు!- పథకం భేషుగ్గా వుందనుకున్నాడు కండక్టరు. ఆ పథకంలో వుఁడే మంచి చెడ్డల గురించి ఆలోచించేటంతటి తెలివితేటలు లోపించేయా కండక్టరికి.

ఇంతకీ అతన్ని ఎలా హత్య చెయ్యడం?- ఆలోచనలో పడ్డాడు.

మనిషి ఎండు బిక్కలాగున్నాడు. అప్పుడు జ్వరంతో బాధపడుతున్నాడు. గట్టిగా పీక పిసికి చంపెయ్యొచ్చేమో!....

అది సుమారు అరణ్య మధ్యస్థంలోనున్న రోడ్డు లాంటిది.

దగ్గరలో ఏగ్రామమూ లేదు.

గోలచేసినా ప్రమాదంలేదు!

అయినా పీక పిసికి చంపెయ్యడం అసాధ్యమోమో!- ఎంత ఎండు బక్కయినా చిన్నపిల్లడు కాదుగా!- అంచేత ఏదైనా ఆయుధాన్ని ఉపయోగించడమే మంచిదనుకున్నాడు దేన్ని ఉపయోగించడం? బస్సులో కత్తిలేదాయె!.... అన్నట్లు "స్క్రూడ్రైవరుంది!- అది చాఁదేఁవిటి ఓమనిషి ప్రాణం తియ్యడానికి? చాలనుకున్నాడు! ఫ్రంటు సీటు క్రింద నున్న సామానుల పెట్టిలో వుందా 'స్క్రూడ్రైవరు'. అది తియ్యడాఁకని 'బాడీ' లోంచి క్రిందకు దిగేడు. ఫ్రంటు సీటు దగ్గర కెళ్ళేడు.

అంతట్లో........

ఏదో అలికిడి!

చుట్టూ పరికించి చూసేడు.

అడుగుల చప్పుడు!

భూతాలలాంటి నల్లటి ఆకారాలు వస్తున్నాయి!

(తరువాయి 22 వ పేజీలో)

# సాక్షి

(12 వ పేజీ తరువాయి)

"ఎ....వ... రు... మీ....రు?" కంపిత స్వరంతో అడిగేడు కండక్టరు.

సమాధానంగా కండక్టరి వక్షస్థలం మీద కత్తిమొన మృదువుగా మోపబడింది!

కండక్టరు దిక్కుచచ్చిపోయాడు.

"అరచినావో కసక్కున లోనకి దిగడి పోతాదది!" అన్నాడాదొంగ.

మరోదొంగ కండక్టరి జేబూలన్నీ గాలించేడు. డబ్బుమాత్రం తీసుకొని, టిక్కెట్టు పుస్తకాలనూ ఏవో కాగితాలనూ కండక్టరి ముఖంమీద గిరవాటేసి - "బస్సు బాగాడే పోఅకూ సల్లగా తొంగో యిందులో!" అని - చీకటిలో అదృశ్యులయారు వాళ్ళు.

అలాగే కొయ్యప్రతిమలా ఆ బస్సుకి చేరబడి పోయేడు కండక్టరు.

దొంగలు చాలా దూరం వెళ్ళిపోయుంటారని నిశ్చయించుకున్నాక కనకరాజు మెల్లగాలేచి.... బస్సుదిగి.... కండక్టరు దగ్గరకెళ్ళి.... అతని భుజంమీద చెయ్యివేసి - "విచారించకు. ప్రాణాలతో వదిలిపెట్టేరు. సంతోషించు!" అన్నాడు.

కండక్టరు ఈ లోకంలోకొచ్చి - "ఏం సంతోషించడం? ఇవాల్టి 'కలెక్షన్' పోయిందనే విచారం మాటకేంగానీ, మా పనివాళ్ళంతా పంచుకోవలసిన బాపతు సొమ్ము అంతే; పండుగ మామూళ్ళ బాపతుసొమ్ము రెండొందల్నీకూడా దోచుకుపోయేరు కదా అని నా విచారం! - నేనే ఆ సొమ్ము వాడేసి, దొంగలు దోచుకు పోయేరని బొంకుతున్నా ననుకుంటారు మా స్టాఫంతా! నేను ప్రమాణం చేసినా వాళ్ళు నమ్మరు. ఏంచెయ్యడమో తోచకుండావుంది." అన్నాడు.

"ఆఁ!.... ఎందుకు నమ్మరు? నేనున్నానుగా సాక్ష్యం!" అన్నాడు కనకరాజు.

"ఆఁ! - అవును!.... మీరున్నారుగా సాక్ష్యం! మీరుకూడా వాళ్ళతోపాటు నడిచెళ్ళిపోయుంటే నామీదనవసరంగా నేరమారోపించ బడుండేది. మీకీనాడు జ్వరం రావడంకూడా ఓరకంగా నామంచికే లాగుంది!" అన్నాడు కండక్టరు విచారంలోంచి తేరుకొని కృతజ్ఞతా భావం వుట్టిపడేటట్లు కనకరాజువేపు చూస్తూ.

"నా అదృష్టం బాగుండబట్టి 'బాడీలో' యిటు ప్రక్క గువ్వపిట్టలా పడుకున్న నేను, వాళ్ళకంటికగుపించలేదు. కనిపించి నట్లయితే శుద్ధ క్షౌరం చేసుండేవాళ్ళు." అన్నాడు కనకరాజు.

కండక్టరికి ఆమాటలేవీ వినిపించలేదు. అతను వేరే ఆలోచనలో వున్నాడు. ఒకవేళ తను కనకరాజుని కూనీ చేస్తున్న సమయంలో దొంగలొస్తే, ఈకథ ఎలా అంతమొందుండేదీ అని? ఆ విషయమై ఆలోచించడానికే భయమేసిందతనికి! -

తను డబ్బు కక్కూర్తికోసం ఎవరినైతే కూనీ చేసెయ్యాలనుకున్నాడో, అతనే తన పరువు ప్రతిష్ఠలను తోటివారి ముందు కాపాడేటందుకు ఆనాడు సాక్షి!

కండక్టరి నేత్రాలు అశ్రుపూరితములయాయి. కనకరాజు పాదాలను పట్టుకొని, బావురుమని ఏడ్చేడు చిన్నపిల్లాడిలా.

"ఇదేఁవిటి? - నీకేం మతిపోయిందేఁవిటి? - ఎందుకూ ఏడుపు? - మరేం ఫరవాలేదులే! మీప్రొప్రయిటరు నాకు బాగా తెలిసినవారేగా? నేచెపుతానులే! - ఇక మీ పనివాళ్ళు పంచుకోవలసిన పండుగమామూళ్ళ తాలూకా డబ్బు పోయిందని నువ్వేమీ విచారించకు!.... నిజానికి ఇవాళ నావద్దనున్న సొమ్ముని కూడా వాళ్ళు దోచుకుపోవలసిందేకదా నన్ను చూసుంటే!.... అది మిగిలింది కాబట్టి, నీ దగ్గర వాళ్ళు దోచుకుపోయిన ఆ పండుగ మామూళ్ళ బాపతు సొమ్ములో కొంత నేనిస్తానులే! అయినా నేను సాక్ష్యముంటానయ్యా అంటున్నా నీకెందుకింత విచారం?" అంటూ కండక్టర్ని ఓదార్చాడు.

పశ్చాత్తాపమనేది ఎంతటి బాధాకరమైన శిక్షో అప్పుడు అర్థమయింది కండక్టరికి. యథార్థాన్ని చెప్పెయ్యాలనుకున్నాడు, కానీ అతని గొంతుక మూగపోయింది!....

తనదగ్గరున్న సొమ్ముని దొంగలు దోచుకుపోవడం నిజమేనని చెప్పేటందుకు కనకరాజు సాక్షి! కానీ అంతకు కొద్ది నిముషాల క్రితం తన మనస్సులో జనించిన ఘోరాతిఘోరమైన తలంపుకు ఎవరు సాక్షి? అతనే!.... ఆ భగవంతుడొక్కడే అందుకు 'సాక్షి' అనుకున్నాడు కండక్టరు.

ఎదురుగా కాంతిరేఖ అగుపించింది?

ఏదోవస్తున్న శబ్దం వినిపించింది.

వచ్చింది లారీ!

అందులోంచి దిగేరు: డ్రైవరూ, క్లీనరూ, ఫోర్‌మెన్ వాళ్ళూనూ!

—:O:—

భయపడకండి

పోలియో అను పిలువబడు స్నాయువాతం చూసి భయపడకండి.

ఆయుర్వేద పద్ధతులలో గ్యారంటీగా కుదర్చ గలం.

ఇప్పటికే ఎన్నో కేసులు కుదిర్చాం.

వివరములకు:

శ్రీ లక్ష్మీ నృశింహ
ఆయుర్వేద వైద్యశాల
మచిలీపట్నం.